కథ

# సహనానికి సరిహద్దు

ముద్దంశెట్టి హనుమంతరావు



మిట్ట మధ్యాహ్నం వేళ...

ఎండ నిప్పులు చెరుగుతోంది. రోడ్డుమీద అంతగా జనసంచారం లేదు. అంత ఎండలోనూ, వాసుదేవరావు సీతారత్నం ఇంటికొచ్చాడు. ఆ సమయంలో అతను రావడం చూసి, ఆశ్చర్య పోయింది, సీతారత్నం. "రండి బాబాయ్..." సాదరంగా లోపలికి ఆహ్వానించింది.

వాసుదేవరావు లోపలికి వచ్చి, వుస్సురనుకుంటూ, సోఫాలో కూచుండిపోయాడు.

"ఈ ఎండలో వచ్చారేంటి బాబాయ్?" ప్రశ్నించింది, సీతారత్నం.

వాసుదేవరావు, సీతారత్నంకి దూరపు బంధువు. ఆ రెండు కుటుంబాల మధ్య అత్యంత సాన్నిహిత్యం వుంది. అందుకే, అతణ్ణి 'బాబాయ్' అనే సంబోధిస్తుందామె.

"ఏం చెయ్యనమ్మా! అవసరం పడింది... వచ్చేశాను. ముందు, ఓ గ్లాసుడు చల్లని నీళ్లు ఇవ్వమ్మా" అంటూ చప్పున లోపలికి వెళ్లి, గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది, సీతారత్నం.

ఎంత దాహంతో వున్నాడో మరి, గటగటా తాగేశాడు, వాసుదేవరావు.

"ఇప్పుడు చెప్పు బాబాయ్, ఈ మండుటెండలో ఎందుకు వచ్చినట్టు?" అంది సీతారత్నం.

క్షణంపాటు సమాధానం చెప్పలేదు, వాసుదేవరావు. అతని కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరుగుతూ వుండటాన్ని గమనించింది, సీతారత్నం.

"ఏముందమ్మా! నిన్ను చూడాలనిపించింది. వచ్చేశాను..." అన్నాడు గాద్గదిక స్వరంతో.

సీతారత్నం, అతని మాటల్ని నమ్మలేదు. "మీరు అబద్ధం చెబుతున్నారు బాబాయ్. మీ మొహంలో దైన్యం, మీ కళ్లల్లో ఆ కన్నీరు, స్పష్టంగా కనిపిస్తున్నాయి. నిజం చెప్పండి. కారణం ఏమిటో? మీ అమ్మాయిలాంటి దాన్ని. నాతో చెప్పడానికేం, చెప్పండి బాబాయ్.." రెట్టింపు ఆసక్తితో అంది, సీతారత్నం.

వాసుదేవరావు, చెమ్మగిల్లిన కళ్లను చేత్తోనే తుడుచుకున్నాడు.

"ఏం చెప్పనమ్మా! చెప్పుకుంటే సిగ్గు. రెండు రోజుల్నుంచీ తిండిలేదు. రాత్రి కేవలం ఓ గ్లాసుడు మంచినీళ్లు తాగి పడుకున్నానమ్మా! మీ పిన్ని, పిల్లలూ సుష్టుగా భోంచేశారు. ఈ రోజు ఉదయం కూడా ఏమీ తినలేదు. హోటల్లో ఏదైనా తిందామంటే, జేబులో డబ్బుల్లేవు. ఇంక ఆకలికి తట్టుకోలేక, ఇలా నీ దగ్గరికి వచ్చేశానమ్మా" ఆవేదనతో చెప్పుకుపోయాడు, వాసుదేవరావు.

సీతారత్నం మనస్సు చలించిపోయింది. వాసుదేవరావు పట్ల అంతులేని సానుభూతి

కలిగింది. అసలు, ఎందుకిలా జరిగిందో, ఆమెకి అర్థం కాలేదు.

"ఏమిటి బాబాయ్ మీరంటున్నది! మా పిన్ని ఇలా ప్రవర్తించిందా? భర్త, ఆకలితో మలమలలాడ్డం, ఆమెకి బాధ కలిగించలేదా? ఎందుకిలా ప్రవర్తించింది?" ఆశ్చర్యపోతూ అంది, సీతారత్నం.

వాసుదేవరావు, భారంగా ఒక నిట్టూర్పు వదిలాడు.

"ఆమెకి ఎందుకు బాధ కలుగుతుందమ్మా! అసలు, సూత్రధారి ఆమెయే కదా? ఇద్దరు అబ్బాయిల్లో, ఏ ఒక్కడికయినా నేను ఉద్యోగంలో వేయించలేదని, అది, నా బాధ్యతా రాహిత్యమని, అబ్బాయిల్లో విషబీజాల్ని నాటింది, ఆమేనమ్మా! దాంతో, అబ్బాయిలిద్దరికీ నా పట్ల ఏహ్యాభావం, విరోధ భావం, పెరిగాయి" చెబుతూ క్షణం ఆగాడు.

"ఆశ్చర్యంగా వుంది బాబాయ్. ఇటువంటి విషయాల్లో, మా పిన్ని మిమ్మల్ని వెనవేసుకు రావాలిగాని, ఇలా మిమ్మల్ని నిందించడం ఏమిటి? నేను నమ్మలేకపోతున్నాను..."

"నువ్వు, ఖచ్చితంగా నమ్మాలమ్మా! నమ్మి తీరాలి. ఆమె సంగతి, నీకు పూర్తిగా తెలీదు. భర్తగా నన్ను ఏనాడూ గౌరవించదు. కొడుకుల్ని తన పక్షాన తిప్పుకుని, ఏదో రూపంలో నన్ను నిందించడమే ఆమె ధ్యేయం! అబ్బాయిలా విషయం అర్థం చేసుకోరమ్మా! అప్పట్లో నా నిర్లక్ష్యానికి శిక్షగా, అప్పుడప్పుడూ ఆకలితో నన్నిలా మాడుస్తూ, ఆనందిస్తుంటారు." బాధపడుతూ చెప్పుకుపోయాడు, వాసుదేవరావు.

"ఇది, చాలా దారుణం బాబాయ్. మీ అబ్బాయిలకి ఉద్యోగాలు ఇప్పించే అధికారంగాని, తాహతుగాని, మీకు లేవని, మీ అబ్బాయిలైనా ఎందుకు ఆలోచించరు?" అంది, సీతారత్నం.

"బాగా చెప్పావమ్మా... అబ్బాయిలంటే, అనుభవశూన్యులమ్మా. కానీ, ఎంతో జీవితానుభవం వున్న మీ పిన్ని తెలివితేటలు ఏమయ్యాయంటావు? నా పెన్షను అంతా తీసుకుంటుంది మీ పిన్ని. నాకంటూ ఏవో ఖర్చులుంటాయి కదా అంటే, అవసరమున్నప్పుడు తనని అడిగి తీసుకోమంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో అడిగినా ఇవ్వదు. నా పరిస్థితికి అప్పుడప్పుడూ, జీవితమ్మీద విరక్తిపుడుతుందమ్మా..." నిరాశతో నిండిన నిస్పృహతో అన్నాడు వాసుదేవరావు. అతని గొంతు జీరవోయింది.

పరిస్థితి ఏమిటో, అర్థమయింది, సీతారత్నంకి. "బాబాయ్, మీరిలా నిస్పృహ చెందకూడదు. సంసారం అన్నాక, ఏవో ఇటువంటి చిన్న చిన్న సంఘటనలు వుంటాయి. మీరేం బాధ పడకండి. పిన్నితో నేను స్వయంగా మాట్లాడుతాను. అన్నీ సర్దుకుంటాయి. మీరు కాళ్లూ, చేతులూ కడుక్కుని రండి, భోంచేద్దురుగాని" అంటూ లోపలికి నడిచింది, సీతారత్నం.

వాసుదేవరావు బాత్రూమ్‌కి వెళ్లొచ్చి, డైనింగు టేబుల్ ముందు కూచున్నాడు. వేడి వేడి భోజనం వడ్డించింది, సీతారత్నం. ఆవురావురుమంటూ భోజనం చేసి లేచాడు, తృప్తిగా.

**కవర్ పేజీ కథ**

ఇవాళ రేపు ఇంటర్నేషనల్ తారలనిపించుకోవటంలోని మజాయే వేరు. కొన్ని రోజుల క్రితం అమెరికన్ పత్రిక 'టైమ్స్' ముఖచిత్రంగా బెంగాలీసుందరి ఐశ్వర్యారాయ్ ఫోటో కనిపించటం గర్వంగా భావించారందరూ. నిజానికి అంతకు ముందు ఆ ముఖచిత్రం నటుడు ఆమీర్ ఖాన్‌ను వరించిందట. ఫోటోగ్రాఫర్ అతుల్ కస్బేకర్, ఆమీర్‌తో ఫోటో సెషన్ కూడా చేసేశాడు. ఐశ్‌కు టైమ్స్ పత్రిక తాలూకు జనంలో ఎవరితో పరిచయం వుందో ఏమో కానీ, రాత్రికి రాత్రి ఆమీర్ ఫోటోను 'హుష్ కాకీ!' చేసేసి ఐశ్ ఫోటో వేసేశారట. దీనికి ఐశ్వర్యకు బెస్ట్ ఆక్ట్రెస్ అవార్డ్ ఇవ్వాల్సిందేననుకుంటున్నారట బాలీవుడ్ జనం.



సీతారత్నంకి, ఎంతో జాలివేసింది అతనిప ట్ల. "అలా వెళ్లి, కాస్సేపు చేరబడండి బాబాయ్..." అంది.

"అలాగేనమ్మా! అన్నదాతా సుఖీభవ!" అనుకుంటూ, హాల్లోకి వెళ్లి సోఫాలో చేరబడ్డాడు.

***

మధ్యాహ్నం నాలుగ్గంటలు అప్పుడే దాటింది. వాసుదేవరావు, మొహం కడుక్కుని వచ్చాడు. సీతారత్నం, కప్పుతో 'టీ' తీసుకొచ్చి అతనికి అందించింది.

"నీకు శ్రమ కలిగించానమ్మా!" టీ సిప్ చేస్తూ అన్నాడు, వాసుదేవరావు.

సీతారత్నం, సన్నగా నవ్వింది.

"అదేం మాట బాబాయ్! మీరేం పరాయివారు కాదు కదా! అవసర సమయంలో, ఈ మాత్రం ఆదుకోకపోతే, బంధుత్వానికి అర్థమేముంది?" అంది, నవ్వుతూనే.

వీధి తలుపు ఎవరో తట్టిన శబ్దం...

సీతారత్నం వెళ్లి, తలుపుతీసింది. ఎదురుగా వాసుదేవరావు పెద్దబ్బాయి రాంబాబు కనిపించాడు.

"నువ్వట్రా రాంబాబు! రా, లోపలికి" అంటూ లోపలికి వచ్చేసింది, సీతారత్నం.

లోపలికి వస్తూనే తండ్రిని చూశాడు, రాంబాబు. కోపంతో, అతని మొహం ఎర్రబారింది.

"ఇంట్లో చెప్పకుండా ఇలా వచ్చేస్తే ఎలా నాన్నా? మేం ఎంత కంగారు పడ్డామో తెలుసా?" అన్నాడు, తండ్రి పక్కనే ఆశీనుడవుతూ.

వాసుదేవరావు, తీక్షణంగా కొడుకు వేపు చూశాడు.

"ఏమిటీ? నా గురించి మీరు కంగారు పడ్డారా? ఎందుకురా అబద్ధం చెబుతావు? నా కడుపుకి ఇంత తిండి పెట్టడానికి శ్రద్ధ చూపని మీరు నా గురించి కంగారు పడతారా? నేనేం అయిపోతే, మీకేంరా? మీకు కావల్సింది, నా పెన్షను డబ్బు!" ధైర్యంగానే అన్నాడు, వాసుదేవరావు.

రాంబాబు, చకితుడయ్యాడు. అతని మొహం, కళా విహీనమయ్యింది. సీతారత్నం అక్కయ్య సమక్షంలో, తండ్రి అలా మాట్లాడ్డం, అవమానకరంగా తోచింది.

"అట్లా ఎందుకు భావిస్తున్నావు నాన్నా? నలుగుర్లో మా పరువు తీస్తున్నావు కదా?" రుస రుసలాడుతూనే అన్నాడు, రాంబాబు.

పొడిగా నవ్వేడు, వాసుదేవరావు.

"ఏమిటీ? నేనా పరువు తీస్తున్నది? గురివింద, తన అడుగుభాగాన వున్న నలుపుని గుర్తించదు. అలా వుందిరా నీ వాదన. గత రెండు రోజులుగా తిండి పెట్టకుండా, నన్ను ఆకలితో మీ కుసంస్కారంతో, ఎప్పుడో మన పరువు పోయిందిరా. అమ్మాయి సీతారత్నం దగ్గరికి వచ్చి ఇంత ఎంగిలిపడ్డానుగాని, లేకపోతే, నేను ఏమైపోయేవాణ్ణి!" అంటూ క్షణం ఆగి, "అయినా, ఇంక నేను ఇటువంటి ఇక్కట్లు భరించలేనురా! అందుకే, నేనో నిర్ణయానికి వచ్చాను..." గంభీరంగా అన్నాడు, వాసుదేవరావు.

"ఏమిటది?" ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు, రాంబాబు.

"మీ దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి బతకడం, ఇంక నావల్ల కాదురా రాంబాబూ! మీ అమ్మతో చెప్పు, నేను వేరే ఇల్లు అద్దెకు తీసుకుని, అక్కడే వుండాలని నిశ్చయించుకున్నాను. నా పెన్షనుతో హాయిగా, స్వేచ్ఛగా జీవిస్తాను." వివరించాడు వాసుదేవరావు.

రాంబాబు షాక్ తిన్నాడు. తండ్రికి, అటువంటి ఆలోచన ఎందుకు వచ్చిందో అర్థం కాలేదు. సీతారత్నం అక్కయ్య ఆ సలహా ఇచ్చి వుంటుందేమోనని సందేహించాడు. అదే నిజమైనా, ఆమెని ప్రశ్నించలేడు కదా!

"అదేమిటి నాన్నా, అర్థం లేకుండా మాట్లాడుతున్నారు? మీరు వేరేగా వుంటే, నలుగురూ ఏమనుకుంటారు?" అన్నాడు మెల్లగా. అతనికి కోపం రాలేదు. ఓ విధమైన భయం పట్టుకుంది. "అనుకోనీరా! నాకేం? మీరు నాకు ఇవ్వాల్సిన గౌరవం, విలువ ఇవ్వనప్పుడు, నేను వేరేగా వుంటే, ఎవరో ఏదో అనుకుంటారన్న భయం నాకు లేదురా?" నిబ్బరంగానే అన్నాడు వాసుదేవరావు.

సీతారత్నం చప్పున కలిగించుకుంది "బాబాయ్, ఏమిటా మాటలు? మీరు వేరేగా వుండటం, మీలో ఎవ్వరికీ శ్రేయస్కరం కాదు. మీ అభిప్రాయాన్ని రాంబాబుకి చెప్పారు కదా! అంతటితో చాలించండి. రాంబాబుతో పాటు ఇంటికి వెళ్లండి." అంటూ రాంబాబుకేసి తిరిగింది.

"ఒరేయ్ తమ్ముడూ, ఆకలి మహా చెడ్డదిరా! అది మనిషిలోని విచక్షణా జ్ఞానాన్ని నశింపజేస్తుంది. ఆకలికి తట్టుకోలేకనే బాబాయ్ మా ఇంటికి వచ్చారు. నేనేం పరాయి వ్యక్తిని కాదు కదా!

మా ఇంటికి వచ్చారు గాబట్టి సరిపోయింది. అదే ఏ రోడ్డుమీదనో మొహం తిరిగి పడిపోతే, ఏం జరిగి వుండేదో, వూహించలేం. ఇంతకీ, ఆయన పట్ల ఎందుకీ నిరాదరణ? ఆయన చేసిన తప్పేమిటి? ఇప్పుడు నీతో అన్నట్టు, వేరేగా వెళ్లిపోయారనుకో... అప్పుడు మీ పరిస్థితి ఏమిటి? విషయం, అంతదూరం వెళ్లకూడదు... నేనిలా అన్నానని, మీ అమ్మతో చెప్పు... సహనానికయినా, ఒక 'హద్దు' వుంటుంది కదా!" పరోక్షంగా హెచ్చరించింది సీతారత్నం.

రాంబాబు, మొహం దించుకున్నాడు. పరిస్థితిని ఆకళింపు చేసుకున్నాడు. తప్పు, తమదేనన్న నిజాన్ని గ్రహించాడు.

"అక్కా, మరి మేం వెళ్లొస్తాం... పదండి నాన్నా..." లేచాడు, రాంబాబు.



వాసుదేవరావూ లేచి నిల్చున్నాడు.

"వస్తానమ్మా సీతారత్నం. సమయానికి నన్ను ఆదుకుని, నా ఆకలి తీర్చినందుకు ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను..." అన్నాడు.

"మంచివారే బాబాయ్! మనలో మనకి ధన్యవాదాలేమిటి? వెళ్లిరండి..." నవ్వుతూ అంది సీతారత్నం.

వాసుదేవరావు, రాంబాబు బైటికి నిష్క్రమించారు.

***

వాసుదేవరావు భార్య రుక్మిణి, భర్తను చూడగానే వుద్రేకంతో ఒంటికాలుమీద లేచింది.

"ఈయన ఎక్కడున్నార్రా రాంబాబూ?" వెటకారంగా ప్రశ్నించింది రుక్మిణి.

"సీతారత్నం అక్కగారింట్లో వున్నారమ్మా! మధ్యాహ్నం భోజనం అక్కడే చేశారట. ఇప్పుడు నేను వెళ్లేసరికి, టీ తీసుకుంటున్నారు..." చెప్పాడు రాంబాబు.

భర్తకేసి ఎర్రగా చూసింది, రుక్మిణి. "అక్కడికి వెళ్లి భోంచెయ్యడానికి, మీకు సిగ్గెయ్యలేదూ? మన పరువు మంటగలిపారు కదండీ. ఈ పాడు బుద్ధి, ఎందుకు పుట్టిందండీ మీకు" వుక్రోషంతో అంది, రుక్మిణి.

వాసుదేవరావు, సమాధానం చెప్పలేదు. రాంబాబు కలిగించుకున్నాడు.

"మన పరువు మంటగలపడానికి, నాన్నగారు కాదమ్మా కారణం! మనమే కారణం..." విసురుగానే అన్నాడు, రాంబాబు.

విస్తుపోయింది, రుక్మిణి. తన కొడుకేనా అలా అంటున్నది. తండ్రి అంటే, మండి పడేవాడు కదా! మరి, ఇప్పుడేమిటీ ఇలా మారాడు?... అనుకుంది మనసులో.

"ఏమిట్రా నువ్వంటున్నది?" తెల్లమొహం వేస్తూ అంది, రుక్మిణి. ఒక పక్క కొడుకుపై కోపం వచ్చింది.

"ఔనమ్మా! రెండ్రోజుల్నించి తిండి పెట్టకుండా, నాన్న కడుపు మాడ్చింది. మనమే కదా! అప్పుడే మన పరువు వీధిన పడింది. మరో మార్గంలేక, నాన్నగారు అక్క ఇంటికి వెళ్లాల్సి వచ్చింది. ఈ పరిస్థితిని కల్పించింది ఎవరు? మనమే కదా! ఆయనకి మనం ఏం గౌరవిస్తున్నామని? ఎంత విలువిస్తున్నామని?" సీరియస్‌గానే అన్నాడు, రాంబాబు.

రుక్మిణికి మతిపోయినట్టయింది. తండ్రిని ఎదిరించి, చులకన భావంతో అతణ్ణి అగౌరవపరుస్తాడనుకున్న కొడుకు... ఒక్కసారి ఇలా ఎందుకు మారాడో, ఆమె ఊహకి అందలేదు. "ఏమిట్రా రాంబాబు, ఒక్కసారి ఇలా మారావు?" తెల్లబోతూ అంది, రుక్మిణి.

"ఔనమ్మా! మారక తప్పలేదు. నేనేకాదు... మనం అందరం మారాలి. నాన్నని గౌరవించకపోవడమే, మనం చేసిన ఘోరమైన తప్పు. అటువంటి 'తప్పు' పునరావృతమైతే, నాన్నగారు ఇంట్లోనుంచి వెళ్లిపోయి వేరే వుంటారట. అప్పుడు వీధిన పడేది మనమేనమ్మా! సీతారత్నం అక్క సమక్షంలోనే ఈ నిర్ణయాన్ని ప్రకటించారు నాన్న. ఇంకా నేను మారకుండా వుండేదెలా చెప్పమ్మా?" విషయాన్ని బహిర్గతం చేశాడు, రాంబాబు.

రుక్మిణి, నిర్ఘాంతపోయింది, భర్తమీద అంతులేని కోపం వచ్చింది. కాని... కాని... ఏమీ అనలేని అశక్తతో, కోపాన్ని బలవంతంగా అణచుకుంది. విసురుగా లోపలికి వెళ్లిపోయింది. రాంబాబు బయటకి జారుకున్నాడు.

వాసుదేవరావు, ముసి ముసి నవ్వు నవ్వుకున్నాడు. తనే విజయం సాధించానన్న గర్వం, అతని అణువణువునా నిండింది.

■